# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలో మౌలిక సదుపాయాలకు వాజ్ పేయి బలమైన పునాది వేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.
- కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.
- మాజీ ప్రధానమంత్రి వాజ్ పేయి జయంతి సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు.
- క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

====================

దేశంలో మౌలిక సదుపాయాలకు అటల్ బిహారీ వాజ్ పేయి బలమైన పునాది వేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. సుపరిపాలనకు అసలైన నిర్వచనంగా ఆయన పాలన సాగిందని అన్నారు. అమరావతి రాజధానిలోని వెంకటపాలెం వద్ద మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహాన్ని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో కలిసి ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వాజ్ పేయి ప్రతిపాదించిన స్వర్ణ చతుర్భుజి రహదారిని మొట్టమొదట తడ, చెన్నైల మధ్యే ప్రారంభించామని గుర్తు చేశారు. టెలికామ్ సెక్టార్ ను డీరెగ్యులేషన్ చేసి ప్రగతికి పునాది వేశారని చెప్పారు. ఆయన ఆశయాలను భావి తరాలకు తెలియచేయాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 26 జిల్లా కేంద్రాలలో ఆయన విగ్రహాలను ప్రతిష్టించిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

దివంగత నాయకుడు, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. విజయవాడ లోక్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వాజ్‌పేయి గొప్ప వక్త, కవి మాత్రమే కాకుండా సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం పాటుబడిన పరిపాలన దక్షకుడు అని కొనియాడారు.

వాజ్ పేయ్ నీతి నిజాయితీలకు మారుపేరు అని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఒంగోలులోని వాజ్ పేయి విగ్రహానికి ఆయన ఈరోజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరం గోరక్షణ పేట వాజ్ పేయ్ విగ్రహం వద్ద స్థానిక పార్లమెంటు సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి నివాళులర్పించారు.

====================

రాష్ట్రంలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చిన కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయం-అనుబంధ రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించేలా కేంద్రం మరింతగా సహకరించాలని ఆయన కోరారు. కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మ్యాంగో బోర్డుతో సహా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని అన్నారు. సూక్ష్మ నీటి సాగు విస్తరణకు 695 కోట్ల రూపాయలు కేటాయించాలని చెప్పారు. అరటి పంట రవాణాలో నష్టాలు తగ్గించేందుకు, మార్కెట్ సదుపాయం పెంచేందుకు రైల్వే వ్యాగన్ల ద్వారా అరటి రవాణాకు సబ్సిడీ కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు.

====================

విరామం

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, శాంతికి ఈ పండుగ సంకేతమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

====================

క్రిస్మస్ పర్వదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఎన్ టి ఆర్ జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను నిర్వహించారు. విజయవాడ సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. చర్చిలకు ప్రజలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. జానెట్ మెమోరియల్ చర్చిలో నిర్వహించిన క్యాండిల్ లైట్ సర్వీసులో ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. మచిలీపట్నంలోని చర్చిలో నిర్వహించిన ప్రత్యేక పార్ధనలలో రాష్ట్ర గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

(వాయిస్...20 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) స్థాపించి 89 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రవేశపెట్టిన 'నవతి ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అండగా ఉండేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

====================

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ గా చేయాలని స్థానిక పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ కోరారు. విజయవాడ సుస్థిర, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ఇది అవసరమని ఆయన అన్నారు. విజయవాడ తూర్పు శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్ తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు కలిశారు. గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఆయన ఈ సందర్భంగా కోరారు. విజయవాడ నగర పరిసరాలలోని 75 గ్రామాలు విలీనమై, గ్రేటర్ విజయవాడ కార్పొరేషన్ ఏర్పాటు జరిగితే పారిశ్రామిక కారిడార్లు, ఐటీ

పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లు, పర్యాటక పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం లభించి, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన చెప్పారు.

=====================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాలు, దక్షిణ కోస్తా జిల్లాలలో రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు.

=====================

పర్యాటకంలో ఎన్‌టీఆర్ జిల్లాను ముందు వరసలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన ఆంధ్రా ట్యాక్సీ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం కలెక్టరేట్‌లో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రా ట్యాక్సీ ప్రత్యేక యాప్ ద్వారా పర్యాటకులకు ఎన్నో సేవలు అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. సురక్షితమైన, విహారయాత్రకు అవసరమైన సేవలను ఈ ప్రత్యేక యాప్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. మొబైల్ యాప్‌తో పాటు క్యూఆర్ కోడ్, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా కూడా ఆటో, ట్యాక్సీ తదితర సేవలను బుకింగ్ చేసుకునే వీలుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

=====================
=====================